మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

ఆదివారం 12-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-
సంపుటి:5 సంచిక 174

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District


## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


## తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !

- ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్‌కు మూడో ఓటమి
- పంజాబ్ కింగ్స్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్
- శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలం
- 219 రన్స్ కొట్టినా కాపాడలేకపోయిన బౌలర్లు

**న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో ఓటమిని చవిచూసింది. శనివారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. బ్యాటర్లు రాణించడంతో 219 రన్స్ చేసినా.. బౌలర్ల వైఫల్యంతో మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకున్న పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో 7 పాయింట్లతో రెండో -మిగతా 3 లో



## క్లీన్ పాలిటిక్స్
# మన లక్ష్యం

### ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి

- జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది
- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి
- ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి
- కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ కార్యక్రమం చేపడతాం
- శిక్షణ తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు

**అమరావతి, ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, -మిగతా 3 లో





## అమరావతిపై జగన్ విష ప్రచారం

- మావిగన్ అంటూ దుష్ప్రచారం.. పెట్టుబడులను అడ్డుకునే కుట్ర!
- పార్లమెంట్‌లో చట్టం చేయించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే.
- హైదరాబాద్ సెక్రటేరియట్ ఖర్చుపై లెక్కలు తేల్చిన మంత్రి.
- అమరావతిలో ప్రపంచస్థాయి వసతులు..
- ధరల పెరుగుదలకి గత ప్రభుత్వ జాప్యమే కారణం.
- రూ. 51 వేల కోట్ల టెండర్లు.. శరవేగంగా అమరావతి పనులు.

**అమరావతి ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న తరుణంలో జగన్ విష ప్రచారం చేస్తున్నారని, మావిగన్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ విమర్శించారు. విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అమరావతి రైతులు పార్లమెంటులో చట్టం చేయించాలని కోరారని, ముఖ్యమంత్రి కేంద్రాన్ని పట్టుబట్టి చట్టం చేయించారని తెలిపారు. పార్లమెంటులో చట్టంపై చర్చ జరుగుతుంటే ఎంపిలు ఏమి చేయాలో చెప్పకుండా ఇక్కడ మావిగన్ అంటూ ప్రకటన చేశారని పేర్కొన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌కు రూ.615 కోట్లకు టెండర్లు ఇచ్చి రూ.1,423 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పార్లమెంటులో -మిగతా 3 లో



## బెంగాల్‌లో తృణమూల్‌కు ఓటమి భయం

- అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు
- బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తాం
- పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం.
- బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

**కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత -మిగతా 3 లో




## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

- ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వ ఏర్పాటు
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా
- అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారింది

**చెన్నై,**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల -మిగతా 3 లో

## యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..





- 49 శాతం వాటాతో భారత్‌దే అగ్రస్థానం..!

**న్యూఢిల్లీ ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలను వెల్లడించింది. ప్రస్తుత ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రియల్-టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో ఏకంగా 49 శాతం వాటాతో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపింది. గణాంకాల ప్రకారం.. కేవలం 2026 జనవరి నెలలోనే యూపీఐ ద్వారా -మిగతా 3 లో

## నేడు తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి.
- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు.
- అధికారికంగా ప్రకటించిన బోర్డు




**హైదరాబాద్ ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు -మిగతా 3 లో



## ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కు

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించింది
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు
- తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసే యత్నం
- ఎన్నికల ప్రచారసభలో మమతా బెనర్జీ విమర్శలు

**కోల్‌కతా,**

ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్టు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, తనపై తప్పుడు కేసులు బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, -మిగతా 3 లో

## రోడ్డు ప్రమాద బాధితులకు
# ఉచిత వైద్యం

### రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం!

- ఏపీలో 'పిఎం-రాహత్' పథకం అమలుకు శ్రీకారం.
- స్థానికత, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా నగదు రహిత చికిత్స.
- గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు కాపాడటమే లక్ష్యం - మంత్రి సత్యకుమార్ యాదవ్.
- రాష్ట్రవ్యాప్తంగా 704 ఆస్పత్రుల్లో సేవలు అందుబాటులోకి.

**అమరావతి ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పిఎం-రాహత్' పథకాన్ని ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అమలుకు అవసరమైన చర్యలు పూర్తి కావొస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్' అవర్లో రూ.1.5 లక్షల వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని ట్రస్టు అనుబంధ గుర్తింపు పొందిన ఆర్థో, పాలీట్రామా సేవలు అందుబాటులో -మిగతా 3 లో







## బీఆర్‌ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

- ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరం
- బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు
- బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు.
- కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

**ములుగు, ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. -మిగతా 3 లో

# బీహార్‌లో రోడ్డు పక్కన పరీక్ష!



**పాట్నా ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
బీజేపీ పాలిత బీహార్‌లో ఓ గ్రామంలోని రోడ్డు పక్కన కొందరు పిల్లలు శ్రద్ధగా పరీక్ష రాయడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. 'సివాన్ జిల్లాలోని ఓ కోచింగ్ కేంద్రం విద్యార్థులు రోడ్డు పక్కన పరీక్ష రాస్తూ ఇలా కనిపించారు. ఇందుకే బీహార్ భారత్‌లోనే అత్యల్ప అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా నిలిచింది' అని ఎక్స్‌లో షేర్ చేసిన ఓ వీడియో కింద రాశారు.ప్రజలు రోడ్లపై ప్రయాణిస్తుండగా కొందరు పిల్లలు నిలబడి, మరి కొందరు కూర్చొని పరీక్ష రాస్తున్న దృశ్యాన్ని చాలా మంది నెటిజన్లు జీర్ణించుకోలేకపోయారు. 'ఎక్కడైతే ఆరు బయలే తరగతి గదిగా మారుతుందో' అని ఒకరు దీనిపై వ్యాఖ్యానించగా 'దీపం కింద చీకటి ఇంకా తొలగిపోలేదు' అని మరొకరు కామెంట్ చేశారు.ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యా బోధన లేకపోవడం వల్లే ప్రైవేట్ కోచింగ్ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయని మరొకరు వ్యాఖ్యానించారు. విద్యా వ్యవస్థలోనే అసలు సమస్య ఉందని మరొకరు వ్యాఖ్యానించారు. ఒక నెటిజన్ మాత్రం శ్రద్ధగా పరీక్ష రాసిన పిల్లల స్ఫూర్తిని మెచ్చుకున్నారు.

# రాహుల్ గాంధీతో మాట్లాడిన మోదీ.. వీడియో వైరల్



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
పార్లమెంట్ ఆవరణలో అరుదైన దృశ్యం చోటుచేసుకున్నది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో ప్రధాని మోదీ కాసేపు మాట్లాడారు. దీంతో ఆ వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నది. కారు నుంచి దిగి వెళ్తున్న మోదీ కాసేపు ఆగి రాహుల్‌తో ముచ్చటించారు. చాలా దగ్గర నిలుచుకున్న ఆ ఇద్దరూ ఓ నిమిషం పాటు మాట్లాడుకున్నారు. పార్లమెంట్‌లో ఎప్పుడూ విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకునే కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా ఆ మీటింగ్ పట్ల ఆసక్తి కనబరిచారు.పార్లమెంట్ ఆవరణలో ఉన్న ప్రేరణ స్థల్‌కు మోదీ వెళ్లారు. మహాత్మా జ్యోతిభా పూలే 200వ జయంతి సందర్భంగా నివాళి అర్పించేందుకు మోదీ వెళ్లారు. అయితే ఆ మార్గంలో ఉన్న రాహుల్‌తో ఆయన కాసేపు ముచ్చటించారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ కూడా ఉన్నారు. అయితే రాహుల్, మోదీ ఏం మాట్లాడుకున్నరన్న దానిపై క్లారిటీ లేదు.

# మనుషులపై సీగల్స్ ఎటాక్!



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
స్కాట్లాండ్ ప్రజలపై పక్షులు యుద్ధం ప్రకటిస్తున్నాయి. దేశంలోని రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో గుమిగూడిన వారిపై, ముఖ్యంగా పిల్లలపై సీగల్స్ అనే పక్షులు దాడులు చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు ఏకంగా 16 వరకూ జరిగినట్టు అధికారులు పేర్కొన్నారు. తొలుత ఒక పక్షి ఒక పిల్లాడిపై ఎటాక్ చేయగానే.. అప్పటికే సిద్ధంగా ఉన్న మరిన్ని పక్షులు ఒకదాని వెనుక ఒకటి వచ్చి బాధిత బాలుడిని పొడిచినట్టు వీడియోల్లో కనిపిస్తున్నది.మనుషుల మాదిరిగా పక్షులు కూడా ప్లానింగ్ ప్రకారం దాడులు చేయడమేంటని పలువురు ఆశ్చర్యపోతున్నారు. అయితే స్కాట్లాండ్‌లో ప్రస్తుతం ఈస్టర్ ఎగ్ హంట్ వేడుకలు జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఓ ఆటను నిర్వహిస్తారు. ఈ ఆటలో దాచిపెట్టిన ఉడికిన కోడి గుడ్లను పిల్లలు కనిపెట్టి బహుమతులు గెలుచుకోవాల్సి ఉంటుంది. అయితే, తాము పెట్టిన గుడ్లను తీసుకోవడానికి పిల్లలు వస్తున్నారేమోననుకొని సీగల్స్ ఇలా దాడి చేస్తున్నట్టు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

# ముంబైలో అగ్నిప్రమాదం..

-- ఇద్దరు పిల్లలు, ఒక వ్యక్తి మృతి

**ముంబై ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
ముంబైలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మీరా భయందర్ ప్రాంతంలోని మురికివాడల్లో శనివారం పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మీరా భయందర్‌లోని ఇంద్రలోక్ ఫేజ్ 4లో ఈ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు, 40 ఏళ్ల వ్యక్తి మరణించారు. అయితే మంటలు భారీ ఎత్తున ఎగిసిపడ్డాయి. గ్యాస్ సిలిండర్లు పేలిపోవడంతోనే ఈ మంటలు ఎగిసిపడినట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# ఆర్టెమిస్ మిషన్ విజయవంతం


- సురక్షితంగా సముద్ర జలాల్లోకి ల్యాండ్ అయిన ఓరియాన్
-- సురక్షితంగా వ్యోమగాముల బృందం
-- చంద్రునిపైకి ప్రయోగాల్లో కీలక అడుగు



**వాషింగ్టన్ ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
దాదాపు అర్ధ శతాబ్ద కాలం తర్వాత చంద్రునికి అత్యంత దగ్గరగా వెళ్ళిన ఆర్టెమిస్ మిషన్ 10రోజుల యాత్ర విజయవంతంగా పూర్తయింది. భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారు జామున 5.37గంటలకు కాలిఫోర్నియా సమీపంలోని పసిఫిక్ మహా సముద్రంలోని శాన్‌డియాగో తీరంలో ఓరియాన్ కాప్స్యూల్ 'ఇంటిగ్రిటీ' సురక్షితంగా ల్యాండ్ అయింది. దీంతో ఓరియాన్ వ్యోమనౌకలో చంద్రుడిని విజయవంతంగా చుట్టేసిన వ్యోమగాములు కమాండర్ రీడ్ వైజ్‌మన్, పైలట్ విక్టర్ గ్రోవర్, మిషన్ స్పెషలిస్ట్‌లు క్రిస్టినా కోచ్, జెరెమి హాన్సెన్‌లతో కూడిన బృందాన్ని నాసా, నేవీ బృందాలు సురక్షితంగా బయటకు తీశాయి. గతంలో మానవులు ఎవరూ వెళ్ళనంత దూరం అంతరిక్షంలోకి వెళ్ళివచ్చిన ఈ నలుగురు వ్యోమగాములు సురక్షితంగా, ఆరోగ్యంగా వున్నారని నాసా ప్రకటించింది. చంద్రుడిని విజయవంతంగా చుట్టేసి వచ్చిన వీరు మొత్తంగా 11లక్షల కిలోమీటర్లు ప్రయాణించారు. భవిష్యత్తుల్లో చంద్రునిపైకి దిగే దిశగా జరిగే ప్రయోగాలకు ఇదొక కీలకమైన అడుగు కానుంది.
గంటకు 40వేల కిలోమీటర్ల వేగంతో ఓరియాన్ తిరిగి భూ కక్ష్యలోకి ప్రవేశించే ప్రక్రియ చాలా ప్రమాదకరమైనది, భూ వాతావరణంలోకి ప్రవేశించే సమయంలో తీవ్రమైన రాపిడులు కారణంగా చెలరేగా అధిక ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లుతాయి. ఓరియాన్ ఉష్ణ కవచం ఆ వేడిమిని విజయవంతంగా తట్టుకుని నిలిచింది. ఆ దశను విజయవంతంగా అధిగమించడంపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. అయితే ఓరియాన్ విజయవంతంగా ఆ దశను అధిగమించి పారాచూట్ల సాయంతో సముద్ర జలాల్లో ల్యాండ్ అయింది.

# రజినీకాంత్, ధనుష్ ఇళ్లలో బాంబులు పెట్టినట్లు బెదిరింపు

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
తమిళ సినీ పరిశ్రమ కి చెందిన ఇద్దరు అగ్ర నటుల ఇళ్లలో బాంబులు పెట్టినట్లు వచ్చిన సందేశం చెన్నై నగరాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. తమిళనాడు డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్ పోలీసులకు ముచ్చెమటలు పట్టించింది. పోయెస్ గార్డెన్‌లోని సూపర్ స్టార్ రజనీకాంత్ నివాసంలో, అల్వార్‌పేటలో ఉన్న హీరో ధనుష్ నివాసంలో బాంబులు అమర్చామని, అవి ఏ క్షణమైనా పేలవచ్చని ఆ బెదిరింపు మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ సమాచారం బయటకు రావడంతో ఒక్కసారిగా అభిమానుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి రంగంలోకి దిగారు. ఇద్దరు నటుల నివాసాల వద్దకు చేరుకున్న భద్రతాదళాలు సుమారు గంటన్నరపాటు క్షుణ్ణంగా సోదాలు నిర్వహించాయి. ఇంటి లోపల, గార్డెన్ ప్రాంతం, పరిసరాల్లో అణువణువూ గాలించారు. కానీ ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలుకానీ, అనుమానాస్పద వస్తువు కానీ లభించలేదు. చివరకు అది ఒక 'ఫేక్ మెయిల్' అని అధికారులు నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే ఎవరో ఆకతాయిలు ఈ పనికి ఒడిగట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు.గతంలోనూ విజయ్, అజిత్ వంటి ప్రముఖుల ఇళ్లకు ఇలాంటి బెదిరింపులు ఎదురైన సందర్భాలు ఉన్నప్పటికీ.. ఈసారి నేరుగా డీజీపీ కార్యాలయానికే మెయిల్ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈమెయిల్ పంపిన వ్యక్తి ఎవరు..? ఏ ఐపీ అడ్రస్ ద్వారా ఈ మెయిల్ పంపారనే కోణంలో సైబర్ క్రైమ్ విభాగం ఆరా తీస్తోంది. తప్పుడు సమాచారంతో ప్రజలను, పోలీసు యంత్రాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. ముందుజాగ్రత్త చర్యగా రజనీకాంత్, ధనుష్ నివాసాల వద్ద అదనపు భద్రతను ఏర్పాటుచేశారు.



# ఇంత ఉత్సాహాన్ని గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదు..

బెంగాల్ ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
పశ్చిమబెంగాల్ లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. శనివారం మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవాళ్లమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే.. గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని.. ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టంచేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడుతల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇక కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో ఈ నెల 9న పోలింగ్ ముగిసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 23న జరుగనుంది. ఈ అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.



# రెండేండ్లలోపు పిల్లలకు దగ్గు సిరప్ నిషేధం?

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
పిల్లల దగ్గుముందు సిరప్‌లు, జలుబు మందులు వాడకంపై నిబంధనలు కఠినతరం చేయాలని కేంద్రం భావిస్తున్నది. దగ్గు మందు సిరప్, జలుబు మందులను రెండేండ్ల లోపు పిల్లలకు వైద్యులు సూచించకుండా, ఐదేండ్లలోపు పిల్లలు వాడకుండా కేంద్ర ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. కల్తీ దగ్గు మందు సిరప్‌లు వాడటం వల్ల భారత్ సహా పలు దేశాల్లో చిన్న పిల్లల మరణాలు నమోదు కావటం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన రేకెత్తించింది.దీనిపై ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్ (ఐపీసీ) డ్రాఫ్ట్ నిబంధనలను రూపొందించింది. వీటి ప్రకారం వైద్యులు, ఫార్మాసిస్టులు సురక్షితమైన ప్రిస్క్రిప్షన్ పద్ధతులు అనుసరించాలి.



# ఇరాన్‌కు చైనా గగనతల రక్షణ వ్యవస్థ

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
అమెరికాతో భీకర యుద్ధం సాగిస్తున్న ఇరాన్‌కు 'గగనతల రక్షణ వ్యవస్థ'ను అందించేందుకు చైనా సిద్ధమవుతున్నదట. రాబోయే కొద్ది వారాల్లో అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థను ఇరాన్‌కు చైనా సరఫరా చేయవచ్చునని యూఎస్ నిఘా వర్గాలు అంచనా వేశాయంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.దీని ప్రకారం, తక్కువ ఎత్తు, దూరం నుంచి దూసుకొచ్చే క్షిపణులను కూల్చటమన్నది ప్రస్తుత యుద్ధంలో కీలకంగా మారింది. ఈ తరహా దాడుల్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా డిజైన్ చేసిన 'మ్యాన్‌పాడ్స్'ను ఇరాన్‌కు చైనా అందించబోతుందట. సైనికుడు తన భుజంపైన 'మ్యాన్‌పాడ్స్'ను మోస్తూ క్షిపణులను కూల్చవచ్చు.



# నో పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని ఈవీకి జరిమానా!



**జైపూర్ ,న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
రాజస్థాన్‌లోని నాగౌర్‌లో ఓ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల ఒక విద్యుత్తు కారుకు కాలుష్య నియం త్రణ ధ్రువీకరణ పత్రం లేదని జరిమానా విధించారు. ఇదేమి చోద్యమని నెటిజన్లు ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో పోలీస్ శాఖ స్పందించి.. దీనిపై దర్యాప్తు జరిపి సదరు జరిమానాను రద్దు చేస్తామని పేర్కొన్నది.ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయిన వీడియో ప్రకారం.. ఓ టాటా టియాగో ఈవీ కారుకు విండ్‌షీల్డ్ షేడ్స్ లేవని ఓ ఏఎస్సై ఆ కారును ఆపి రూ.200 జరిమానాగా విధించారు. అయితే వాహన కాలుష్యం నియంత్రణలో ఉందని తెలిపే పీయూసీ సర్టిఫికెట్ లేదనే కారణంతో రూ.1,500 జరిమానా అదనం గా విధించారు. తనది విద్యుత్తు కారని.. దానికి ఆ ధ్రువీక రణ పత్రం అవసరం లేదని కారు యజమాని వాదించినా ఏఎస్సై వినిపించుకోలేదు. అయితే దీనిపై రాజస్థాన్ పోలీస్ విభాగం స్పందిస్తూ.. ఆ జరిమానా పొరబాటున జారీ అయ్యి ఉండొచ్చని తెలిపింది. కేంద్ర మోటార్ వాహనాల నిబంధనలు, 1989 ప్రకారం విద్యుత్తు వాహనాలకు కాలు ష్య నియంత్రణ తనిఖీల నుంచి మినహాయింపు ఉంది.

# తేలిపోయిన సన్‌రైజర్స్ బౌలర్లు !

మొదటి తరువాయి



స్థానంలో నిలిచింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 28 బంతుల్లో 74 రన్స్ చేశాడు. సన్ రైజర్స్ భారీ స్కోరు చేయడంతో విజయంపై ధీమాగా ఉంది. కానీ సన్ రైజర్స్ బౌలర్లు మాత్రం పంజాబ్ కింగ్స్ బ్యాటర్ల ముందు తేలిపోయారు. పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పేశారు ఆ జట్టు బ్యాటర్లు. సన్ రైజర్స్ హైదరాబాద్ పవర్ ప్లేలో 105/1 చేయగా.. పంజాబ్ కింగ్స్ కూడా ధాటిగా బదులిచ్చింది. పవర్ ప్లే ముగిసే సరికి 93/0తో నిలిచింది. ప్రియాన్ష్ ఆర్యా 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ప్రభ్ సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51 రన్స్) కూడా సత్తాచాటడంతో పంజాబ్ ఆధిపత్యం చలాయించింది. ప్రియాన్ష్ (20 బంతుల్లో 57 పరుగులు) ఔట్ అయిన తర్వాత శ్రేయస్ అయ్యర్ బాధ్యత తీసుకున్నాడు. 33 బంతుల్లో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ టోర్నీలో మూడో విజయాన్ని సాధించింది. శివంగ్ కుమార్ మినహా సన్ రైజర్స్ బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. శివంగ్ 4 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. జయదేవ్ ఉనద్కత్ 3 ఓవర్లు వేసి 40 పరుగులు, ఎషాన్ మలింగ 3 ఓవర్లలో 46 పరుగులు, హర్షల్ పటేల్ 2 ఓవర్లలో 39 పరుగులు సమర్పించుకున్నారు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026లో మూడో ఓటమిని చవిచూసింది.

## బెంగాల్‌లో తృణమూల్‌కు ఓటమి భయం

మొదటి తరువాయి

కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## 200కు పైగా సీట్లలో గెలుస్తున్నాం

మొదటి తరువాయి

మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రొగ్రసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కు

మొదటి తరువాయి

ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ పక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తొలగించిన 90 లక్షల మంది ఓటర్లలో 60 లక్షల మంది హిందువులు, 30 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. బెంగాలీ మాట్లాడినంత మాత్రమే మనం భారతీయులం కాదా? నిరంతరం పౌరసత్వం నిరూపించుకోవాలా?' అని మమతా బెనర్జీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామంటూ బీజేపీ ఎన్నికల హామీపై మాట్లాడుతూ, ఈ చర్యను వెనుకబడిన వర్గాలపై నేరుగా దాడి చేసేందుకు, ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కొల్లగొట్టేందుకు జరుపుతున్న దాడిగా ఆమె పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌లో యూసీసీని అమలు చేసేది లేదన్నారు. రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికారంలోకి వచ్చి.. ఢిల్లీలో బీజేపీకి ఉద్వాసన పలుకుతామని, ఆ వెంటనే యూసీసీని రద్దు చేస్తామని మమత స్పష్టం చేశారు.

# అమరావతిపై జగన్ విష ప్రచారం

మొదటి తరువాయి

రూ.862 కోట్లకు టెండర్లు పిలిచి రూ.1,172 కోట్లు ఖర్చు చేశారని, చదరపు అడుగుకు రూ.16,900 ఖర్చు చేశారని పేర్కొన్నారు. జాతీయ రహదారికి కేవలం రోడ్డువేసి వదిలేస్తారని, అమరావతిలో అన్ని రకాల సదుపాయాలూ కల్పిస్తున్నామనే విషయాన్ని జగన్ పార్టీ పట్టించుకోవడం లేదని అన్నారు. దోమలు లేని నగరం కావాలంటే 100 శాతం యుజిడి ఉండాలని పేర్కొన్నారు. లైట్లు, గ్రీనరీ 2014కు ముందే పూర్తయితే ఖర్చు తగ్గేదన్నారు. తారు, ఇనుము ధరలు పెరిగాయని పేర్కొన్నారు. ధరలు పెరిగితే అంచనాలు పెరుగుతాయని, దీనికి గత ప్రభుత్వం పనులు చేయకపోవడమే కారణమని అన్నారు. పనులన్నీ టెండర్ల ద్వారానే ఇచ్చామని, నామినేషన్ పద్ధతుల్లో



ఇవ్వలేదని తెలిపారు. ఐదు వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంకు పక్కనబెట్టామని వివరించారు. వాటిని అమ్మి అప్పులు చెల్లిస్తామని పేర్కొన్నారు. మావిగన్ ప్రతిపాదనను ప్రజలు ఛీకొడుతున్నారని వివరించారు. జగన్ ప్రకటనల వల్ల పెట్టుబడులు రాకుండా పోతాయని విమర్శించారు. అమరావతికి ఇప్పటికే రూ.పదివేల కోట్లు ఖర్చయిందని, రూ.51 వేల కోట్ల టెండర్లు పిలిచామని అన్నారు. అమరావతి నిర్మాణం జరిగితే ఎకరా రూ.20 కోట్లు అవుతుందని తెలిపారు. రాజధానిని 217 చదరపు కిలోమీటర్లకు ప్లాన్ చేశామని, అప్పుడు ప్రాజెక్టులు వారీ భూములు తీసుకుంటున్నామని అన్నారు. పెదపరిమిలో వెయ్యి ఎకరాలు ఒకేరోజు సమీకరణకు ఇచ్చారని పేర్కొన్నారు. పార్లమెంటులో సిఆర్‌డిఏ రీజియన్‌ను స్పష్టంగా ప్లాను చేశామని అన్నారు

# క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యం

మొదటి తరువాయి

కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశర చేశారు. జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్ధే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే మావిగన్ ప్రకటనలకు ప్రజలే సమాధానం చెబుతారు. అభివృద్ధి అనేది ఒకచోట ఆగేది కాదు. హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు, ఐటీ రంగం ఆదాయాన్ని పెంచాయి. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందుతూనే ఉంది. అమరావతి కూడా ఇదే తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఇ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్



బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఇ3 ప్రొగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

మొదటి తరువాయి

ఉన్న 687 ప్రైవేట్, 17 ప్రభుత్వాస్పత్రుల్లో అమలు చేస్తున్నామని ప్రకటించారు. ట్రస్టు కార్యాలయంలో ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితుల ఆర్థిక పరిస్థితులు, స్థానికతతో సంబంధం లేకుండా ఎవరికైనా సరే ఆస్పత్రుల్లో చేరినప్పుడు తక్షణ సాయం కింద ఏడు రోజులపాటు లేదా రూ.1.5 లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా ఆస్పత్రులు అందించాలని వెల్లడించారు. సత్వర చికిత్సతో త్వరగా క్షతగాత్రులు కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మోటారు వెహికల్ చట్టం-162, 1988 అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై ట్రస్టు ద్వారా ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లు, జిల్లా సమన్వయకర్తలు, జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు ఆదేశాలు పంపినట్లు వివరించారు. బీమా సదుపాయం కింద క్లైమ్ చేసిన వారికి మినహా మిగిలిన వారికి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఆర్‌బిఐ



నిబంధనలకు అనుగుణంగా ఆస్పత్రులకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. వైద్యారోగ్య శాఖతో పాటు పోలీస్, రోడ్డు రవాణా శాఖలు ఈ పథకం అమల్లో భాగస్వాములుగా ఉన్నాయని వెల్లడించారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆస్పత్రికి తీసుకొచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుందని, ఒకవేళ సదరు ఆస్పత్రుల్లో చికిత్సకు తగ్గ సౌకర్యాలు లేకుంటే అక్కడి వారు రవాణా సౌకర్యాలు కల్పించాలని వివరించారు.

## నేడు తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.


## బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

మొదటి తరువాయి

ఇప్పటికే బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

## యూపీఐ పేమెంట్స్‌కు పదేళ్లు పూర్తి..

మొదటి తరువాయి




21.70 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.28.33 లక్షల కోట్లు.దేశంలోని మొత్తం రిటైల్ డిజిటల్ లావాదేవీల్లో 81 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. ప్రారంభమైన నాటి నుంచి లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువలో 4,000 రెట్లకు పైగా వృద్ధిని యూపీఐ నమోదు చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ సైతం యూపీఐని ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అభివర్ణించింది. కేవలం లావాదేవీల సంఖ్యకే పరిమితం కాకుండా యూపీఐ సామాన్యుడి జీవితంలో కూడా భాగమైంది. ఆటోరిక్షా డ్రైవర్ల నుంచి వీధి వ్యాపారులు, గ్రామీణ మార్కెట్ల వరకు యూపీఐ సేవలు విస్తరించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య, అధికారిక, అనధికారిక ఆర్థిక వ్యవస్థల మధ్య అంతరాన్ని తగ్గించి, ఆర్థిక సమ్మిళితత్వానికి మార్గం వేసిందని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొన్నది. భారత యూపీఐ వ్యవస్థ పనితీరు, భద్రత, వేగాన్ని ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు ప్రశంసించాయి. ప్రస్తుతం యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ సహా 8 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా యూపీఐ లైట్, యూపీఐ ఆటోపే, క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి కొత్త సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. దశాబ్ద కాలంలోనే దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం గమనార్హం.

# సంపాదకీయం

## ఆత్మరక్షణలో కాంగ్రెస్ !



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్గుల్ రైతులు ఃూజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

## మహాత్మా జ్యోతిరావ్ పూలే కు ప్రధాని, రాష్ట్రపతి నివాళులు



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్పూలే 200వ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములు నివాళులర్పించారు. శనివారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీతో కలిసి పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణా స్థల్ వద్ద మహాత్మా జ్యోతారావ్ పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ నివాళి కార్యక్రమంలో లోక్సభ స్పీకర్ ఓంబిర్లా, లోక్సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, జెపి నడ్డా, మాజీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్లు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా 'సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాలకు తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు నివాళు లర్పిస్తున్నాను. ఆయన మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో మార్గదర్శకుడు. అతని కృషి వల్ల, విద్య సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. ఈ సంవత్సరం మనం ఆయన 200వ జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్నాము. సామాజిక ప్రగతి సాధనలో ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నాము' అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్లో పోస్టు చేశారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ప్రధాని మోడీ మాట్లాడటం గమనార్హం.

### ఎట్టకేలకు పోలీసులకు

## చిక్కిన డ్రగ్ క్వీన్..

### సీక్రెట్ ఆపరేషన్ సక్సెస్



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

ఢిల్లీ లో మాదక ద్రవ్యాల నెట్వర్క్ను నడుపుతూ 'డ్రగ్ క్వీన్ గా పేరుపొందిన కుసుమ్ అనే మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న ఆమె ఆచూకీ కోసం పోలీసులు రెండు నెలల క్రితం సీక్రెట్ ఆపరేషన్ (ూవఓతీవ్ ూజూవతీష్ఱశీఅ) చేపట్టారు. వారాల తరబడి 200 సీసీటీవీ కెమెరాలు, 100 ఫోన్లను ట్రాక్ చేశారు. తాజాగా ఢిల్లీలోని షాదారా ప్రాంతంలోగల ఓ ఇంట్లో కుసుమ్ ఉన్నట్లు గుర్తించారు.సీక్రెట్గా ఆ ఇంట్లోకి వెళ్లి కుసుమ్ను అరెస్ట్ చేశారు. నిందితురాలిపై 11 కేసులు, రూ.50 వేల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గతంలో కుసుమ్ ఢిల్లీలోని సుల్తాన్పురిలో డ్రగ్స్ విక్రయిస్తూ గ్యాంగ్స్టర్లతో కలిసి పనిచేసేది. క్రమంగా సొంత డ్రగ్ సిండికేట్ను ఏర్పాటు చేసుకొంది. ఢిల్లీలో హత్యలు, దోపిడీ, మాదకద్రవ్యాల దందాను చురుగ్గా నడిపిస్తోంది. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించింది. పలు రాష్ట్రాలలోని మాదకద్రవ్యాల ముఠాలు ఆమె నేతృత్వంలోనే నడుస్తున్నాయి. ఆమె ఇద్దరు కుమార్తెలు, సోదరుడు కూడా ఇదే సిండికేట్లో పని చేస్తున్నారు. కుసుమ్ ఎక్కడా తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా జాగ్రత్త పడేది. ఆమెపై అనుమానం ఉన్నప్పటికీ.. అదుపులోకి తీసుకోవడం పోలీసులకు సాధ్యం కాలేదు. 2003 నుంచి పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు. వారు దాడులు చేపట్టిన ప్రతిసారీ కుసుమ్ మాయమైపోయేది. ఫోన్ను ఉపయోగించకుండా కొత్త ప్రదేశాల్లో తలదాచుకుంటూ ఉండేది.

# ఇరాన్ ఆస్తుల విడుదలకు అంగీకారం?

**-ముగిసిన అమెరికా-ఇరాన్ తొలిదశ చర్చలు**
**- లెబనాన్ విషయంలో అస్పష్టత**



**ఇస్లామాబాద్ : ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

అమెరికా-ఇరాన్ల మధ్య పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్లో జరిగిన తొలిదశ చర్చలు ముగిశాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ చర్చల ప్రక్రియ రాత్రి పది గంటల వరకు కొనసాగింది. ఉదయం నుండి దఫాల వారీగా ఈ చర్చలు జరిగాయి. రాత్రి భోజనం తరువాత కూడా చర్చలు కొనసాగుతాయని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, భోజనం తరువాత ఉదయం నుండి ఏకాభిప్రాయానికి వచ్చిన అంశాల వివరాలకు సంబంధించిన సమాచార పత్రాలను ఇరు దేశాల బృందాలు పరస్పరం మార్చుకుని,చర్చల ప్రకియను ముగించాయి. ఉదయం వేరువేరు గదుల్లో ఉండి పాకిస్తాన్ అధికారుల మధ్య వర్తిత్వంతో చర్చలను జరిపిన ఇరు దేశాల బృందాలు మధ్యాహ్నం నుండి ముఖాముఖి సమావేశమయ్యాయి. ఇలా ఉన్నతస్థాయిలో అమెరికా-ఇరాన్ల మధ్య ముఖాముఖీ చర్చలు జరగడం 1979 ఇస్లామిక్ విప్లవం తరువాత ఇదే మొదటిసారి! విశ్వసనీయ వర్గాలను ఉటంటకిస్తూ ఈ చర్చల్లో కొంత పురోగతి ఉన్నట్లు 'అల్జజీర' వార్తా సంస్థ తెలిపింది. ఖతార్తో పాటు వివిధ ఇతర దేశాల్లో స్థంభింపచేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి అమెరికా అంగీకరిచినట్లు చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు తెలిపారని సంస్థ పేర్కొంది.

ఒక్క ఖతార్లోనే దాదాపు 55 వేల కోట్ల రూపాయల ఆస్తులను విడుదల చేయడానికి అమెరికా అంగీకరించినట్లు సమాచారం. వివిధ ఇతర దేశాల్లో కూడా చమురు విక్రయాల ద్వారా లభించిన మొత్తం అమెరికా ఆంక్షల కారణంగా స్తంభించిపోయి ఉంది. ఇప్పుడు ఆ మొత్తాన్ని విడుదల చేయడానికి అంగీకరించినట్లు చెబుతున్నారు. అరుతే, అమెరికా నుండి ఎటువంటి ప్రకటన రాలేదు. అదే సమయంలో చర్చల వివరాలను, సాధించిన ఫలితాలను రాత్రి 12 గంటల వరకు కూడా ప్రకటించలేదు. అదే సమయంలో లెబనాన్పై కాల్పుల విరమణకు చర్చల్లో ఇరాన్ పట్టుబట్టినప్పటికీ అమెరికా స్పందన, దానిపై ఇరాన్ వైఖరి ఏమిటన్నది తెలియరాలేదు. మరోవైపు చర్చలు జరుగుతున్న సమయంలో కూడా ఇజ్రాయల్ లెబనాన్పైకాల్పులు కొనసాగించింది.

**తొలుత పాక్ ప్రధానితో భేటీ**

ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నేతృత్వంలోని అమెరికా బృందం, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘేర్ గలిబాఫ్ నేతృత్వంలోని ఇరాన్ ప్రతినిధి బృందం తొలుత పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్తో విడివిడిగా భేటీ అయ్యాయి. అనంతరం ఇస్లామాబాద్ నగరంలోని ఒక ఫైవ్ స్టార్ హోటల్ వేదికగా అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు ప్రారంభమైనాయి. తొలుత వేర్వేరు గదుల్లో కూర్చున్నారు. వారు పాకిస్తాన్ అధికారుల ద్వారా పరస్పరం సందేశాలను ఇచ్చి పుచ్చుకున్నారు. మధ్యాహ్నం భోజన విరామ అనంతరం ముఖాముఖి సమావేశమయ్యారు.

**అమెరికా, ఇరాన్ ప్రతినిధులు వీరే**

అమెరికా ప్రతినిధి బృందంలో వైస్ ప్రెసిడెంట్ జె.డి వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సలహాదారు, అల్లుడు జేర్డ్ కుష్నెర్ ఉన్నారు. ఇక ఇరాన్ ప్రతినిధి బృందంలో ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఉన్నారు. అమెరికా ప్రతినిధి బృందం ప్రత్యేక విమానంలో శనివారం తెల్లవారుజామునే ఇస్లామాబాద్కు చేరుకుంది. ఇక ఇరాన్ ప్రతినిధులతో కూడిన విమానం శుక్రవారం రాత్రి పాకిస్తాన్ గగనతలంలోకి ప్రవేశించగానే, దాని చుట్టూ యుద్ధ విమానాలను మోహరించి ఎయిర్బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్(అవాక్స్)తో పాకిస్తాన్ వాయుసేన భద్రతను కల్పించింది. ఇరాన్ విమానం ఇస్లామాబాద్కు చేరుకునే వరకు ఇదే విధమైన పకడ్బందీ పహారాను అందించారు.

## 39 రోజుల్లో 39 ఫైటర్ జెట్లు..

### ఇరాన్ యుద్ధంలో కోల్పోయిన అమెరికా




**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

ఇరాన్పై యుద్ధం కోసం చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో అమెరికాకు భారీ నష్టం వాటిల్లినట్టు పలు నివేదికలు వెలువడుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య 39 రోజులుగా సాగిన యుద్ధంలో, 39 యుద్ధ విమానాలను యూఎస్ కోల్పోయినట్టు వార్తలు వెలువడ్డాయి. అంతేగాక అమెరికాకు చెందిన పలు డ్రోన్లు, ఫైటర్ జెట్స్ను, నిఘా కోసం పంపిన వాటిని ఇరాన్ కూల్చివేసినట్టు తెలుస్తున్నది.ఆధునిక కాలంలో అమెరికా వాయుసేనకు ఎదురైన భారీ నష్టాల్లో ఇదొకటిగా నివేదికలు పేర్కొన్నాయి. వివిధ వర్గాలను ఉటంకిస్తూ టీడబ్ల్యూజెడ్, సీబీఎస్, ఇతర అమెరికన్ మీడియా ఉదహరించిన రక్షణ నివేదికల్లో పై అంశాలు ఉన్నాయి.దీని ప్రకారం, 39 రోజులు సాగిన యుద్ధంలో అమెరికా 39 యుద్ధ విమానాలను కోల్పోయింది. అలాగే మరో 10 యుద్ధ విమానాలు వివిధ స్థాయిల్లో దెబ్బతిన్నాయి. అమెరికా హొర్ముజ్ జలసంధిపైకి పంపిన 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, యూఎస్ నేవీ పంపిన ఎంక్యూ-4క్యూ ట్రిటాన్ నిఘా డ్రోన్లు మళ్లీ తిరిగిరాలేదు.

### ఆశా భోస్లేకు తీవ్ర అస్వస్థత..

## ముంబై దవాఖానలో చేరిక

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**



ప్రముఖ సినీ నేపథ్య గాయని ఆశా భోస్లే శనివారం ముంబైలోని బ్రీచ్ క్యాండీ దవాఖానలో చేరారు. ఛాతీ ఇన్ఫెక్షన్, నిస్సత్తువ కారణంగా ఆమెను దవాఖానలో చేర్చినట్టు ఆమె మనవరాలు జనాయ్ భోస్లే తెలిపారు. చికిత్స కొనసాగుతున్నదని, ఆమె ఆరోగ్యంపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.తమ ప్రైవసీని గౌరవించాలని కోరారు. ఈ మేరకు ఆమె ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేశారు. ఆశా భోస్లేకు గుండెపోటు వచ్చినట్టు అంతకుముందు మీడియాలో వార్తలు వచ్చాయి. ఆశా భోస్లే వివిధ భారతీయ భాషల్లో 12 వేలకు పైగా పాటలు పాడారు.

## ఖమేనీకి తీవ్ర గాయాలు!.

**టెహ్రాన్: ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**

ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ముఖానికి, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని రాయిటర్స్ నివేదిక తెలిపింది. ఖమేనీ సన్నిహితులు ఈ విషయాలను వెల్లడించినట్టు సమాచారం. రాయిటర్స్ నివేదిక ప్రకారం మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డా మానసికంగా చురుగ్గా ఉన్నారు. ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిపాలన విధులు నిర్వహిస్తున్నారు.యుద్ధం, శాంతి చర్చలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. విశ్లేషకుల అంచనా ప్రకారం మొజ్తబా ఒక గళంగా ఉంటారు. ఆయన తనను తాను సర్వోన్నతమైన పాలకుడిగా నిరూపించుకోవాల్సి ఉంది.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

-సామాజిక విప్లవకారుడు పూలే ఆశయాలను కొనసాగిద్దాం: ఉపాధ్యాయులు శివశంకర్.
-లోకోజుపల్లి ఎంపీపీ పాఠశాలలో పూలే చిత్రపటానికి నివాళులు.




**తనకల్లు ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఆమడగూరు మండలంలోని లోకోజుపల్లి ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో సామాజిక విప్లవకారుడు, విద్యావేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివశంకర్ మాట్లాడుతూ.. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పూలే అని కొనియాడుతూ స్త్రీ విద్యకు ఆద్యుడు: 1848లోనే పూణేలో బాలికల కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించి, స్త్రీ విద్యకు బాటలు వేశారని 1873లో 'గులాం గిరి' గ్రంథాన్ని రచించి కుల వ్యవస్థపై గళం విప్పారు. అలాగే కుల సమానత్వం కోసం 'సత్యశోధక్ సమాజ్' స్థాపించి సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టారని, గాంధీజీ కంటే ముందే ప్రజలచే 'మహాత్మా' అని పిలవబడిన గొప్ప దార్శనికుడు పూలే. బహుముఖ ప్రజ్ఞాశాలి,ఆయన కేవలం సంఘ సంస్కర్త మాత్రమే కాదు.. గొప్ప వ్యాపారవేత్తగా, కాంట్రాక్టరుగా కూడా రాణించారని విద్యార్థులకు వివరించారు. లింగ వివక్ష లేని సమాజం కోసం పూలే చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామికి విశేష పూజలు.



**రుద్రవరం. (డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రం రుద్రవరం సమీపంలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామికి ధూప దీప నైవేద్యాలతో కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. పూజా కార్యక్రమాలకు నంద్యాల ,కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు హాజరైన భక్తులకు నిర్వాహకులు ఉదయం పూట అల్పాహారము మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు.

## జిల్లా వైసీపీ బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నాగిరెడ్డి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి ఎంపిక



**చిట్వేలి ఏప్రిల్ 11. డ్రీమ్ టైమ్స్**
వైసిపి పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అన్నమయ్య జిల్లా వైసీపీ అనుబంధ విభాగాల కమిటీలో బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా చిట్వేలి మండల వాసి నాగిరెడ్డి రాజేంద్రప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ఆ పార్టీ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసరెడ్డి, అన్నమయ్య జిల్లా యూత్ వింగ్ అధ్యక్షులు వై. శివప్రసాద్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకానికి విధేయుడుగా పనిచేస్తూ, పార్టీ ఎదుగుదలకు తను వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

## భక్తులను.. అలరించిన నృత్యప్రదర్శన





**శ్రీశైలం ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
శ్రీశైలదేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా శ్రీ గురు నృత్యాలయ కూచిపూడి డాన్స్ అకాడమీ, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక పై శనివారం సాయంత్రం నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో గణపతి ప్రార్థన, శివపంచాక్షరి స్తోత్రం, చిదంబరస్తోత్రం, జతిస్వరం, నమశ్శివాయతే తదితర గీతాలకు హిమశ్రీ, హిమవర్షిణి, సహస్ర, ధాత్రి, మయూఖ, శ్రీశ్రేష్ఠ, వైష్ణవి, అభిజ్ఞ తదితరులు నృత్యప్రదర్శనతో భక్తులను అలరించారు.

## తండ్రి, కూతురిపై అల్లుడు కత్తితో దాడి.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
మండలం పరిధిలోని గోవిందపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో కుటుంబ కలహాలు తీవ్రరూపం దాల్చి దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇట్టే వెంకటేశ్వర్లు మరియు ఆయన కుమార్తె సంజమ్మపై అల్లుడు చంద్రశేఖర్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు, సంజమ్మలకు గాయాలు కావడంతో వెంటనే వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూధన తెలిపారు. కుటుంబ వివాదాలే ఈ దాడికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## వైస్సార్సీపీ కార్యకర్త కుమారుని వివాహ శుభకార్యక్రమం నకు హాజరు అయిన కాటసాని బ్రదర్స్



**బనగానపల్లె, ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం శ్రీ మద్దిలేటి దేవస్థానం నందు అవుకు మండలం గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన తిరిపిగారి మద్దిలేటి కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,అవుకు మండల వైయస్సార్ సిపి పార్టీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి తదితరులు

## ఘనంగా పూలే 200 వ జయంతి వేడుకలు



**పత్తికొండ ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మస్తాన్ బి జిల్లా కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం పబ్లిక్ రీడింగ్ రూమ్ ఆవరణంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు ముందుగా కాని చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా పత్తికొండ అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్ నాయుడు హాజరై వారు మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక సమానత్వం కోసం,విద్యా హక్కుల కోసం చేసిన కృషి దేశానికి ఆదర్శప్రాయమని తెలిపారు. పీడిత,బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రతి ఒక్కరూ పూలే ఆలోచనలు,ఆశయాలను అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి మల్లికార్జున. బిజెపి అధికార ప్రతినిధి బ్రహ్మయ్య. పత్తికొండ బిజెపి మండల అధ్యక్షుడు కరణం నరేష్. హరీష్ నాయక్. భగవాన్ రావు. కరణం చంద్రన్న. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సీసీ రంగన్న,నరసింహులు. గోపాలు. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతి రావు ఫూలే జయంతి వేడుకలు



**బనగానపల్లె, ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాత్మా జ్యోతి రావు ఫూలే 200 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ బి. సి సంక్షేమ సంఘముబనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షులు ఈడిగ వెంకటరమణ గౌడ్ ఆధ్వర్యంలో మహాత్మా ఫూలే గారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ గౌడ్ మాట్లాడుతు జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల వారికి విద్య కోసం, అంటరానితనం,కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు మహిళలకు విద్య సమాన హక్కుల కోసం పోరాటం చేశారని తెలిపారు అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో ఫూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమం లో గౌడ సంఘం మండల అధ్యక్షులు బి. దేవుడు గౌడ్, శాలివాహన సంఘము నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరి సురేష్ బాబు, బీసీ సంఘం నాయకులు వెంకటాపురం కుమ్మరి శేఖర్, సుబ్బారాయుడు గౌడ్, టైలర్ మౌలాలి ,కొండయ్య గౌడ్,దూదేకుల తిరుపతయ్య,రిషి కుమార్ గౌడ్, మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీకి ఈతోడు గ్రామస్తుల భారీ విరాళం!

-ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా "స్పందించు సాయం అందించు" - ఘనంగా విరాళాల సేకరణ
-పేదల జీవితాల్లో వెలుగుల కోసమే ఆర్డీటీ కృషి: ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుకన్య
-సిబిటి అరుణమ్మ ఆధ్వర్యంలో ఆర్డీటీకి అండగా ఈతోడు గ్రామ సంఘ సభ్యులు



**తనకల్లు ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తనకల్లు మండలంలో ఈతోడు గ్రామంలో ఆర్డిటి వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా సిబిటి అరుణమ్మ ఆధ్వర్యంలో ఆర్డిటి "స్పందించు సాయం అందించు" కార్యక్రమం ద్వారా విరాళాలు సేకరించిన డబ్బు 30,000 (ముప్పై వేలు) రూపాయలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ మేడం సుకన్య,సీఈఓ లకు అందజేశారు. ఆర్డిటి సంస్థ పేదలపాలిటీ పెన్నది అని, ఒక మంచి సంకల్పంతో పేదలకి అండగా నిలిచిన ఆర్డీటి సంస్థ ద్వారా పేదవారి జీవితంలో వెలుగులు నింపడానికి ఈ డబ్బు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుకన్య, సీఈవో, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ కోటిరెడ్డి, సంఘం ఉపాధ్యాయురాలు అరుణ, ప్రజా సంఘం నాయకుడు ఒంటెద్దు వేమన్న, సంఘం లీడర్లు, సంఘ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు: సీఐ



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.** ఆళ్లగడ్డ పట్టణ శివారులోని పి. చింతకుంట సమీపంలోని టిడ్కో గృహ సముదాయంలో శనివారం టౌన్ పోలీసులు కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద ఇళ్లలో విస్తృత సోదాలు చేశారు. సీఐ యుగంధర్ మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జ్యోతిబాపూలే ఆశయాలే సమాజ మార్పుకు మార్గదర్శకం

- మేధా శ్రీనివాసరావు



**బాపట్ల ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా బాపట్లలోని సమాజవాది పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘన నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు అర్పించి, ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు మాట్లాడుతూ, జ్యోతిబాపూలే విద్య, సమానత్వం అనే రెండు ప్రధాన సూత్రాలను ముందుకు తీసుకువచ్చారని అన్నారు. బ్రిటిష్ కాలంలోనే విద్యా విస్తరణకు పునాది వేసి, పేదలు, బహుజన వర్గాల అభివృద్ధికి కృషి చేయడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు.
స్త్రీ విద్య కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను ఆయన విశేషంగా కొనియాడారు. మహిళలు, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల వారు విద్యలో ముందుకు రావాలని ఆమె చూపిన మార్గం ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు.అలాగే, రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ జ్యోతిబాపూలేను తన గురువుగా భావించడం ఆయన మహత్తును చాటిచెబుతుందని పేర్కొన్నారు. పూలే ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిపిఐ నాయకుడు దాసి నాగేశ్వరరావు సహా పలువురు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# వైస్సార్సీపీ నాయకున్ని పరామర్శించిన కాటసాని బ్రదర్స్



**బనగానపల్లె, ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
బనగానపల్లె నియోజకవర్గం. బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు చిన్న వెంకటరెడ్డికి గత కొన్ని రోజులుగా అనారోగ్యం తో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి , అవుకు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి.
ఈ కార్యక్రమం లో సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ మహ్మద్ హుస్సేన్, తూర్పుంటి శ్రీనివాసరెడ్డి, కొత్త మిద్దెల రామేశ్వర్ రెడ్డి, పెద్ద నాగేశ్వర్ రెడ్డి, అంబాపురం శ్రీనివాసరెడ్డి, పెసెట్టు గారి శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి గారి నాగేశ్వర్ రెడ్డి,చక్రపాణి రెడ్డి, బాల వెంకట , రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## జ్యోతిబాపూలేకు 'భారతరత్న' ఇవ్వాలి: అమీర్ బాషా



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం హైస్కూల్లో మహాత్మ జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. హెడ్మాస్టర్ వీర రాఘవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపుస్మా డివిజన్ అధ్యక్షుడు అమీర్ బాషా పాల్గొన్నారు. సమాజ సంస్కరణలు, విద్య కోసం పూలే చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. హక్కుల పోరాట యోధుడు పూలేకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**యాచారం ,ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు యాచారం మండలం నక్కర్త - మేడిపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజ సంస్కరణల పట్ల చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా, మండల కమిటీ సభ్యులు ఆలంపల్లి. జంగయ్య, ముచ్చర్ల లాజర్, గ్రామ శాఖ కార్యదర్శులు గడ్డం కుమార్, వడ్డేమోని భూషణ్, ఆలంపల్లి యాదయ్య శ్రీ వార్డ్ సభ్యులు ఆలంపల్లి మహేష్ మరియు పార్టీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన

**-కలెక్టర్ రాజకుమారి పిలుపు**
**-పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు కీలకం - కలెక్టర్**
**-స్క్రీన్ టైమ్ తగ్గించి ఆటలు, పుస్తక పఠనం పెంచాలి**
**-మహిళా, శిశు అభివృద్ధి అధికారులకు ఓరియంటేషన్ ట్రైనింగ్**




**నంద్యాల, ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
జిల్లాలో ఈ నెల 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా మరియు శిశు అభివృద్ధి, సాధికారత శాఖలో పనిచేస్తున్న అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "పోషణ్ పక్వాడా" 8వ ఎడిషన్ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ వరకు సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు పడుతున్నాయని ఆమె హెచ్చరించారు. అధిక ఉప్పు, సోడియం కలిగిన ఆహారం వల్ల రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండ సమస్యలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే జంక్ ఫుడ్ వల్ల ఖాళీ కేలరీలు అధికంగా శరీరంలో చేరి ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. పీచు పదార్థాల లోపం కారణంగా జీర్ణక్రియ సమస్యలు, మలబద్ధకం వంటి ఇబ్బందులు వస్తాయని, సహజమైన పండ్లు, కూరగాయలు, పోషకాహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు చక్కెరలు, ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారం పిల్లల్లో ప్రవర్తనా సమస్యలు, ఏకాగ్రత లోపం, అతి చురుకుదనం వంటి సమస్యలకు దారితీస్తుందని తెలిపారు.మన సంప్రదాయ ఆహారం ఆరోగ్యానికి బలమని, స్థానిక ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు అత్యంత కీలకమని, ఈ సమయంలోనే 80 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని ఆమె వివరించారు. చిన్నారులకు చక్కెర వినియోగాన్ని తగ్గించడం, మొబైల్ ఫోన్లు, టీవీ స్క్రీన్‌లను దూరంగా ఉంచడం అత్యంత అవసరమని చెప్పారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల నిద్రలేమి, కంటి సమస్యలు, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య పోషకాహారం, క్రమబద్ధమైన ఆటలు, కుటుంబంతో గడిపే సమయం కీలకమని పేర్కొన్నారు. ఇంటి లోపల, బయట ఆటలు ఆడేలా ప్రోత్సహించడం ద్వారా శారీరక, సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి అలవాట్లు పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని, భాషా నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పెద్దలతో సమయం గడపడం ద్వారా కుటుంబ బంధాలు బలపడటమే కాకుండా సంప్రదాయాలు తదుపరి తరాలకు చేరుతాయని పేర్కొన్నారు. పిల్లల శ్రేయస్సు కోసం ఇప్పటి నుంచే సరైన నిర్ణయాలు తీసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారి లీలావతి మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారి లీలావతి, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# టెన్త్ పేపర్ కరెక్షన్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**బాపట్ల, ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
పదో తరగతి పరీక్షా పత్రాల కరెక్షన్ పారదర్శకంగా, పకడ్బందీగా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవా స్పష్టం చేశారు. శనివారం బాపట్ల పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న కరెక్షన్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరెక్షన్ జరుగుతున్న విధానంపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, పలు గదుల్లో జరుగుతున్న ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కరెక్షన్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ఆయన, ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి సమస్యలకు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం రెగ్యులర్ విద్యార్థుల కరెక్షన్ కోసం 750 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 1,77,819 మంది విద్యార్థుల ప్రశ్నాపత్రాలు బాపట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఈ నెల 6న ప్రారంభమైన మూల్యాంకనం 15వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు.అలాగే ఓపెన్ స్కూల్ పదో తరగతి పత్రాల కరెక్షన్ కూడా శనివారం నుంచి ప్రారంభమైందని, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొంటూ 12,408 ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెక్షన్ జరుగుతుందని, ఒక్కో ఉపాధ్యాయుడు సగటున 40 పత్రాలు పరిశీలించేలా ప్రణాళిక రూపొందించారని వివరించారు.ఈ కేంద్రాన్ని ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జామినర్ శివకుమార్, ఉప విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, ఉపాధ్యాయులు సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# నవ వధువులకు పెళ్లి కానుక పంపిణీ



**బనగానపల్లె,ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నవ వధువులకు పెళ్లి కానుక పంపిణీ చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి తెలిపారు శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో పట్టణంలోని తెలుగు పేటకు చెందిన జక్కు చిన్న సురేష్, కీ.శే. రమాదేవి దంపతుల కుమార్తె చంద్రిక, పవన్ కళ్యాణ్ ల వివాహం సందర్భంగా వారికి పెళ్లి కానుక అందజేశారు.ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ 2022 లో ప్రారంభమైన పెళ్లి కానుక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.
2025 - 2026 సంవత్సరంలో కాలంలో 262 మందికి పెళ్లి కానుకలు అందజేసినట్లు తెలిపారు .కుల మతాలకు అతీతంగా అందరికీ పెళ్లి కానుకను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు .బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన నవ వధువుల కోసం ఉచితంగా పెళ్లి కానుక పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తన తల్లిదండ్రులు కీ.శే. బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం నియోజకవర్గం లోని ఆయా గ్రామాల్లో వివాహం చేసుకోబోయే నూతన వధువులకు ఉచితంగా పెళ్లి కానుక అందజేయడం జరుగుతుందన్నారు. పెళ్లి కానుకలో రూ.2 వేలు విలువ చేసే పెండ్లి కుమార్తెకు చీర, పెళ్లి కుమారుడికి ప్రముఖ షియారామ్ కంపెనీ సర్ట్, పాయింటు ఉంటాయన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఈ పెళ్లి కానుక అందజేస్తున్నట్లు తెలిపారు. వధువు తరపున పెళ్లి కార్డు తీసుకొని వచ్చి తనను సంప్రదిస్తే వారికి పెళ్ళికానుకను అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల , సంజామల, కొలిమిగుండ్ల , అవుకు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిసి రాజా రెడ్డి కోరారు.

## మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన ర్యాలీ



**మహబూబాబాద్,ఏప్రిల్ 11 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. జిల్లా అధికారి ఉమా రాణి మాట్లాడుతూ, యువత మత్తు మందులకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, మందుల దుకాణదారులు పాల్గొన్నారు.

# బిజినెస్

## బలపడిన సూచీలు లాభాల్లో స్టాక్ మార్కెట్లు ..!



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ లాభాల బాటపట్టాయి. బ్యాంకింగ్ రంగ షేర్లకు మదుపర్ల నుంచి వచ్చిన కొనుగోలు మద్దతుతో పాటు అంతర్జాతీయ పరిణామాలు సానుకూలంగా మారడంతో సూచీలు బలపడ్డాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, క్రూడాయిల్ ధరలు దిగివస్తుండటం మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి 30 షేర్ల సూచీ సెన్సెక్స్ 918.60 పాయింట్లు (1.20%) ఎగబాకి 77,550.25 వద్ద ముగిసింది. ఒక దశలో ఇది వెయ్యి పాయింట్లకు పైగా పెరిగింది. మరోవైపు నిఫ్టీ 275.50 పాయింట్లు (1.16%) పెరిగి 24,050.60 వద్ద స్థిరపడింది. రంగాలవారీగా చూస్తే .... బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు మంచి ప్రదర్శన కనబరిచాయి. ముఖ్యంగా వాహన రంగ సూచీ 2.75% పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. బ్యాంకింగ్ సూచీ కూడా 2.06% లాభపడింది. అదే సమయంలో ఐటీ, దాని అనుబంధ రంగాల్లో మాత్రం అమ్మకాలు నమోదై నష్టాలు చవిచూశాయి. షేర్ల వారీగా ... ఏషియన్ పెయింట్స్ సుమారు 4% పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి ప్రధాన షేర్లు 2%కు పైగా లాభపడ్డాయి. మరోవైపు ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. వారాంతపు దలాల్ స్ట్రీట్ మార్కెట్ ప్రదర్శన గణనీయంగా మెరుగుపడింది. ఈ వారం మొత్తం సెన్సెక్స్ 4,230.7 పాయింట్లు (5.77%) లాభపడగా, నిఫ్టీ 1,337.50 పాయింట్లు (5.88%) ఎగబాకింది. అదే సమయంలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా వరుసగా 1.64%, 1.50% పెరిగాయి. మొత్తం మీద గ్లోబల్ సంకేతాలు అనుకూలంగా మారడం, చమురు ధరల తగ్గుదల, బ్యాంకింగ్ రంగంలో కొనుగోళ్లు పెరగడం వంటి అంశాలు మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

## బంగారం ధరల్లో ఊహించని సీన్..

### ఒక్కసారిగా ధరలు పెరుగుదల.



బంగారం కొనుగోలుచేసేవారికి బిగ్ షాక్ తగిలింది. గోల్డ్ రేట్లు భారీగా పెరుగుదల నమోదు చేశాయి. ఒక్కసారిగా ఉన్నట్లుండి ధరలు హైక్ అయ్యాయి. మొన్నటివరకు ధరలు పడిపోగా.. ఇప్పుడు మళ్లీ పెరుగుతూ వస్తోన్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి, ట్రంప్ ప్రకటనలు, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం బంగారం ధరలపై పడింది. శనివారం బంగారం, వెండి ధరలు దేశంలోని వివిధ నగరాల్లో ఎలా ఉన్నాయంటే. హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,840 వద్ద కొనసాగుతోంది. ఇక నిన్న రూ.1,52,350గా ఉండగా.. నిన్నటితో చూసుకుంటే రూ.490 పెరిగింది. ఇక 22 క్యారెట్ల ధర ప్రస్తుతం రూ.1,40,100 వద్ద కొనసాగుతోండగా.. నిన్న రూ.1,39,650 వద్ద ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.450 పెరిగిందని చెప్పవచ్చు. అటు చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,53,820 వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.1,54,090గా ఉంది. అటు 22 క్యారెట్ల ధర రూ.1,41,000గా ఉండగా.. శుక్రవారం రూ.1,41,250 వద్ద స్థిరపడింది. అటు బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,840 వద్ద ఉండగా.. నిన్న రూ.1,40,100 వద్ద స్థిరపడింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,52,990 వద్ద ఉండగా.. నిన్న రూ.1,40,250 వద్ద ట్రేడవుతోంది. ఇక ముంబైలో 24 క్యారెట్ల రేటు రూ.1,52,840 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,100 వద్ద ఉంది. ఇక వెండి ధరలు చూస్తే.. ముంబైలో కిలో సిల్వర్ రేటు రూ.2.60 లక్షల వద్ద ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి రూ.2.65 లక్షల వద్ద ఉండగా.. చెన్నైలో కూడా ఇదే ధర కొనసాగుతోంది. మొత్తానికి బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పెరుగుదల ఇంకెంత కాలం కొనసాగుతుందనేది చూడాలి.


## నిస్సాన్ టచ్‌పాయింట్ల విస్తరణ

**ముంబై,**

నిస్సాన్ మోటర్స్..ప్రస్తుతేడాది తొలి త్రైమాసికం(జనవరి-మార్చి మధ్యకాలంలో) దేశవ్యాప్తంగా 54 కొత్తగా టచ్‌పాయింట్లను ప్రారంభించింది. వీటిలో 3ఎస్(సేల్స్, సర్వీసెస్, స్పేర్‌పార్ట్స్) సేవలు కూడా అందిస్తున్నట్టు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వాత్సా తెలిపారుకస్టమర్లకు మరింత చేరువకావాలనే ఉద్దేశంతో టచ్‌పాయింట్లను వచ్చే మార్చి నాటికి 400కి పెంచుకోనున్నట్టు ఆయన ప్రకటించారు.




## వైభవ్ ఆటకు కోహ్లీ ఫిదా.. 'భలే ఆడావు' అంటూ ఆటోగ్రాఫ్..!




ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటకు దిగ్గజాలు ఫిదా అవుతున్నారు. అనామక బౌలర్లను అలవోకగా బాదేస్తున్న వైభవ్.. ప్రపంచ స్థాయి పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్, హేజిల్‌వుడ్‌లను సునాయసంగా ఎదుర్కోవడం చూసి 'వారెవ్వా ఏమన్నా టాలెంటా' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ చిచ్చరపిడుగు వీరకొట్టుడును ప్రత్యక్షంగా వీక్షించిన విరాట్ కోహ్లీ సైతం 'భలే ఆడావు చిన్నోడా' అని కితాబిచ్చాడు. అంతేనా.. మ్యాచ్ అనంతరం వైభవ్‌కు ప్రేమగా ఆటోగ్రాఫ్ ఇచ్చి జోరు ఇలానే సాగనీ అని మనస్ఫూర్తిగా అభినందించాడు విరాట్. అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రానికి ముందే సంచనాలు సృష్టిస్తున్నాడు వైభవ్ సూర్యవంశీ. పదిహేనేళ్ల ఈ కుర్రాడు సుడిగాలి ఇన్నింగ్స్‌లతో క్రికెట్‌ను ఎంతో ప్రేమించే భారతీయుల మనసులు చూరగొంటున్నాడు. ఒకప్పుడు సచిన్, కోహ్లీ కోసం స్టేడియాలకు తరలి వచ్చిన అభిమానులు ఇప్పుడు వైభవ్ ఆటను కళ్లారా చూసేందుకు పోటెత్తుతున్నారు. ఐపీఎల్‌లో పిడుగల్లే విరుచుకుపడుతున్న లెఫ్ట్ హ్యాండర్ ఆటను శుక్రవారం భారత లెజెండ్ విరాట్ కోహ్లీ స్వయంగా చూసి ఫిదా అయిపోయాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం అలవోకగా ఎదుర్కొంటున్న అతడి ధైర్యం, ప్రతిభను కొనియాడిన విరాట్ మ్యాచ్ అనంతరం ఆటోగ్రాఫ్ ఇచ్చాడు. వెల్‌డన్ వైభవ్ అని వైభవ్ క్యాప్ మీద సంతకం చేశాడు కోహ్లీ. ఆర్సీబీపై 78 పరుగులతో రాణించిన ఈ కుర్ర పవర్ హిట్టర్ రాజస్థాన్ నాలుగో విజయంలో కీలకమయ్యాడు. పవర్ ప్లేలోనే అర్ధ శతకం బాదేసి బెంగళూరు నుంచి విజయాన్ని లాగేసుకున్నందుకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు ఆరెంజ్ క్యాప్(300 పరుగులు)ను కూడా అందుకున్నాడీ డాషింగ్ బ్యాటర్. కొసమెరుపు ఏంటంటే.. ఈ మ్యాచ్‌లో వైభవ్ తుఫాన్ ఇన్నింగ్స్‌ను విరాట్ అద్భుత క్యాచ్‌తో ముగించాడు.

## హమ్మయ్య గెలిచాం

### ఊపిరి పీల్చుకున్న సీఎస్కే ఫ్యాన్స్.. ఐపీఎల్ 2026లో బోణీ..!

-ఐపీఎల్ 2026లో బోణీ కొట్టిన సీఎస్కే
-డీసీపై 23 పరుగుల తేడాతో విక్టరీ
-వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడిన డీసీ




ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఐపీఎల్ 2026లో బోణీ కొట్టింది. హ్యాట్రిక్ ఓటములతో సీజన్‌ను ప్రారంభించిన ఆ జట్టు.. శనివారం చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసి.. 212 రన్స్ చేసింది. అనంతరం ఢిల్లీని 189 పరుగులకు ఆలౌట్ చేసింది. ఈ విజయంతో పాయింట్ల ఖాతాను సీఎస్కే తెరిచింది. పదో స్థానం నుంచి 9వ స్థానానికి చేరింది. 213 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు మెరుపు శుభారంభం దక్కింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (18), పథుమ్ నిస్సాంక (41) ఐదు ఓవర్లలో 61 పరుగులు జోడించారు. దీంతో ఛేజింగ్‌కు బలమైన పునాది వేశారు. కానీ ఆ తర్వాత సీన్ రివర్స్ అయింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లే.. ఔట్ అయ్యారు. 61/0తో ఉన్న డీసీ.. 76/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో ట్రిస్టన్ స్టబ్స్ (60), డేవిడ్ మిల్లర్ (17) ఆదుకునే ప్రయత్నం చేశారు. తీరా స్కోరు వేగం పెంచే క్రమంలో ఔట్ అయిపోయారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమి ముందే ఖరారైపోయింది. చివరకు సరిగ్గా 20 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్.. 189 పరుగులకు ఆలౌట్ అయింది. 23 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది. సీఎస్కే బౌలర్లలో జెమీ ఓవర్టన్ అత్యధికంగా 4 వికెట్లు తీశాడు. అన్షుల్ కాంబోజ్ 3, ఖలీల్ అహ్మద్, గుర్జప్నీత్ సింగ్, నూర్ అహ్మద్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్.. సంజూ శాంసన్ (56 బంతుల్లో 115 నాటౌట్) అజేయం సెంచరీతో భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఆయుశ్ మాత్రే 36 బంతుల్లో 59 పరుగులు చేశాడు. ఈ విజయంతో ఐపీఎల్ 2026లో సీఎస్కే బోణీ కొట్టింది. పాయింట్ల పట్టికలో రెండు పాయింట్స్ జమ చేసుకుని పదో ప్లేసు నుంచి 9వ స్థానానికి చేరింది. కోల్‌కతా నైట్ రైడర్స్ పదో ప్లేసుకు పడిపోయింది.

# స్పోర్ట్స్

## పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో మరో వివాదం..

### క్రీజ్ నుంచి పక్కకు వెళ్లిన కివీస్ బ్యాటర్.. వీడియో



ఇస్లామాబాద్:

పాకిస్థాన్ సూపర్ లీగ్ లో మరో వివాదం చోటుచేసుకున్నది. క్వెట్టా గ్లేడియర్స్ స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్ యాక్షన్‌కు వ్యతిరేకిస్తూ.. రావాల్పిండి బ్యాటర్ డారెల్ మిచ్చెల్ క్రీజ్ నుంచి పక్కకు వెళ్లాడు. తారిక్ బౌలింగ్‌లో ఆడేందుకు మిచ్చెల్ అయిష్టత ప్రదర్శించాడు. రావాల్పిండి చేజింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. బౌలర్ తారిక్ యాక్షన్‌పై గతంలోనూ కొందరు బ్యాటర్లు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. బౌలింగ్ చేసే క్రమంలో అతను క్రీజ్ వద్దకు వచ్చిన తర్వాత కాసేపు ఆగి ఆ తర్వాత బంతిని డెలివరీ చేస్తాడు. ఆ యాక్షన్ వల్ల కొందరు బ్యాటర్లు అతన్ని ఆడేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఇక న్యూజిలాండ్ బ్యాటర్ డారెల్ మిచ్చెల్ కూడా పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆ ఇబ్బంది ఎదుర్కొన్నాడు. తారిక్ వేసిన ఓ బంతిని ప్యాడిల్ స్వీప్ చేసిన మిచ్చెల్.. ఆ తర్వాత బంతి వేసే సమయంలో క్రీజ్ పక్కకు వెళ్లాడు. ఆ తర్వాత కూడా మరో బంతికి మిచెల్ అలాగే పక్కకు జరిగాడు. తారిక్ యాక్షన్ సరిగా లేదన్నట్లు మిచ్చెల్ అసహనం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో అంపైర్ జోక్యం చేసుకుని బ్యాటర్‌తో మాట్లాడాడు. కానీ సౌద్ షకీల్ బౌలింగ్‌లో మిచ్చెల్ ఔటయ్యాడు. 61 రన్స్ తేడాతో రావల్పిండి జట్టు ఓటమిపాలైంది.

# ప్యారడైజ్ నుంచి కాయదు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయదు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఞూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.







## మతిపోగొడుతున్న మీనాక్షి, కిలాడి బ్యూటీ కిర్రాక్ అందం

# అనుపమ ఫాలో అవుతున్న ఫార్ములా ఏంటి ??

అనుపమ పరమేశ్వరన్ లాస్ట్ ఇయర్ ఎన్ని సినిమాలు చేశారో తెలుసా? ఆ నెంబర్ ని ఈ ఇయర్ రిపీట్ చేస్తారా? అసలు సినిమాల సెలక్షన్ విషయంలో ఆమె ఫాలో అవుతున్న విధానం ఏంటి? డైరక్షన్ కలలను సైడ్ చేసేశారా? ఇలాంటి చాలా విషయాలు డిస్కస్ చేసుకుందాం వచ్చేయండి. సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అనుపమ సైన్ చేశారంటే సినిమాలో ఏదో స్పెషాలిటీ ఉండి తీరుతుందని ఇప్పటికే చాలా మంది ఫిక్సయ్యారు. అయితే నేపథ్యం, లేకుంటే కథ, కథనం.. ఎక్కడో ఏదో కొత్తగా ఉంటేనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు ఈ బ్యూటీ. లాస్ట్ ఇయర్ ఏకంగా అరడజను సినిమాలతో మెప్పించారు అనుపమ. వాటిలో కొన్ని పెద్దగా ఆడకపోయినా, మరికొన్ని మాత్రం ఆమెకు చాలా సినిమాలను తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది కూడా లాక్ డౌన్ మూవీ ఉంది ఆమె ఖాతాలో. మరోవైపు తెలుగులో క్రేజీ కల్యాణం అనే సినిమాలో నటిస్తున్నారు. మరోవైపు షాన్ తో అనుపమ మూవీ కూడా ప్రేక్షకుల్లో ఇంట్రస్ట్ క్రియేట్ చేస్తోంది. గతంలో వీరిద్దరూ కలిసి చేసిన ఓ షార్ట్ పిల్మ్ జనాల్లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు అదే జోడీ తెరమీదకు రానుండటంతో క్రేజీ బజ్ స్టార్ట్ అయింది. నటిగా ఎంత ఎదిగినా, డైరక్టర్‌గానూ ప్రూవ్ చేసుకోవాలన్నది ఈ బ్యూటీ డ్రీమ్. అందుకే ఏ సెట్లో ఉన్నా, డైరక్షన్ డిపార్ట్ మెంట్ లో పనిచేస్తున్నట్టుగానే ఫీలవుతున్నానంటారు ఈ లేడీ



## నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్




పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.

# ఓటిటిలోకి యూత్ మూవీ

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు మరియు బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.




Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831